



TGTEL/26/A2235

DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక

## హర్కాయిలో తీవ్ర తాగునీటి సంక్షోభం

రెండు రోజులుగా నిలిచిపోయిన మిషన్ భగీరథ సరఫరా

బావులు ఎండిపోవడంతో ప్రజల అవస్థలు



03

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 02 | 13-05-2026 బుధవారం | పేజీలు: 04 | వెల: 3/-

# నిప్పుల కొలిమిలా తెలంగాణ

వచ్చే ఐదు రోజులు జాగ్రత్త

ఎండలపై వాతావరణ శాఖ కీలక ప్రకటన

తెలంగాణలో మళ్లీ ప్రతాపం చూపుతున్న భానుడు

వచ్చే ఐదు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం

ప్రజలను బెంబేలెత్తిస్తున్న ఉక్కపోత.. 40 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రతలు

ఎండ తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలో 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసిన అధికారులు

ద్రోణి ప్రభావం తగ్గడంతో మళ్లీ పొడి వాతావరణం.. వేడిగాలుల తీవ్రత

మే చివరివరకు తగ్గని ఎండలు..మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని సూచన

అకాల వర్షా లు, ఎండల మధ్య నలిగిపోతున్న రైతన్న

తేమ గాలులు మాయం.. సోమవారం నుంచి పెరిగిన ఎండల తీవ్రత



హైదరాబాద్, (డిడి9 వార్త): తెలంగాణ రాష్ట్రంలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. గత నెల రోజులుగా భానుడి భగభగలకు జనం అల్లాడిపోతుండగా, ఇప్పుడు ఎండల తీవ్రత మరింత పెరగనుందన్న వార్త ప్రజలను కలవరపెడుతోంది. రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని, ఎండలు తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇప్పటికే అనేక ..మిగతా 2లో

# ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత



ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై వేటు తప్పదు

ధాన్యం, మొక్కజొన్న సేకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగితే కఠిన చర్యలు

లారీలు పంపని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశం

అవసరమైతే రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను ధాన్యం నిల్వకు వాడుకోవాలి

అకాల వర్షా ల నుంచి పంటను కాపాడేందుకు టార్పాలిన్ల పంపిణీ

సరిహద్దు రాష్ట్రాల ధాన్యం తెలంగాణకు రాకుండా కట్టుదిట్టమైన నిఘా

ధాన్యం లోడింగ్ పూర్తికాగానే రైతులకు తక్షణ రశీదుల జారీ

ఈ నెలాఖరులోగా సేకరణ ప్రక్రియను ముగించాలని మంత్రుల సూచన

హైదరాబాద్, (డిడి9 వార్త): తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం సేకరణ మరియు మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యుద్ధం ప్రకటించారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులపై తీవ్రంగా స్పందించిన ఆయన, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు ఉన్నతాధికారులతో ..మిగతా 2లో

## నీట్ రద్దు.. విద్యార్థులకు శాపంగా ఎన్టీఏ వైఫల్యం

"23 లక్షల మందికి మానసిక క్షోభ"..

విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆగ్రహం

పరీక్ష రద్దు

కేంద్రం వైఫల్యమన్న కేటీఆర్

2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందన్న కేటీఆర్



03

# హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

పోక్సో కేసుపై బెయిల్ పిటిషన్

అరెస్ట్ చేసేందుకు పోలీసుల వేట

మే 14న వెకేషన్ బెంచ్ విచారణ

ప్రస్తుతం పరారీలో ఉన్న భగీరథ్

ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు

కేసు విచారణకు ప్రత్యేక బృందం ఏర్పాటు

కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో దర్యాప్తు

బాలిక కుటుంబం సంచలన ఆరోపణలు

ఎదురుదాడి చేస్తున్న భగీరథ్ వర్గం

విచారణలో జాప్యంపై అధికారులను నిలదీసిన సీఎం

బాలిక తల్లిదండ్రులు వేధిస్తున్నారని కరీంనగర్‌లో కేసు



హైదరాబాద్, (డిడి9 వార్త): కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ చుట్టూ పోక్సో కేసు ఉచ్చు బిగుస్తోంది. ఓ మైనర్ బాలికను వేధిస్తున్నారనే ఆరోపణలతో నమోదైన ఈ కేసు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లోనూ, న్యాయ వర్గాల్లోనూ పెను సంచలనంగా మారింది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన పోక్సో కేసులో అరెస్టు కాకుండా తప్పించుకునేందుకు భగీరథ్ తాజాగా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కోర్టుకు వేసవి సెలవులు ఉన్నందున, తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మే 14వ తేదీన విచారణ జరిగే అవకాశం ఉందని సమాచారం. అయితే, పోలీసులు మాత్రం నిందితుడు భగీరథ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని స్పష్టం చేశారు. బాధితురాలి తల్లిదండ్రులు ..మిగతా 2లో

# నీట్ 2026 పరీక్ష రద్దు

విద్యార్థుల భవితవ్యం కోసం కేంద్రం సంచలన నిర్ణయం

నీట్ యూజీ 2026 పరీక్షను పూర్తిగా రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం

ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఎన్‌టీఏ కఠిన నిర్ణయం

మే 3వ తేదీన ముగిసిన పరీక్ష.. త్వరలోనే రీ-ఎగ్జామ్ తేదీల ప్రకటన

కేసును సీబీఐకి అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన ఉత్తర్వులు

రాజస్థాన్‌లో బయటపడ్డ లీకేజీ డొంక.. వాట్సాప్‌లో హల్చల్ చేసిన పేపర్

విద్యార్థులకు ఊరటగా పరీక్ష ఫీజు రీఫండ్ మరియు ఉచిత రీ-ఎగ్జామ్

22.79 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంపై నీలినీడలు.. ఎన్టీఏ భరోసా

కోచింగ్ సెంటర్ల పాత్రపై పోలీసుల ఆరా.. పలువురు అనుమానితుల అరెస్ట్



నేషనల్‌బ్యూరో (డిడి9 వార్త): దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల కల అయిన వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియలో పెను ప్రకంపనలు రేగాయి. మే 3వ తేదీన నిర్వహించిన నీట్ యూజీ2026 ప్రవేశ పరీక్షలో భారీ అక్రమాలు, ప్రశ్నాపత్రం లీకేజీ జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన ..మిగతా 2లో

## సనాతన ధర్మంపై ఉదయనిధి వివాదాస్పద వ్యాఖ్యలు

తమిళనాడు అసెంబ్లీ వేదికగా మళ్లీ రాజకీయ రచ్చ

సనాతన ధర్మంపై పాత వ్యాఖ్యల పునరుద్ఘాటన

ప్రతిపక్ష నేతగా తొలి ప్రసంగంలోనే ఘాటు వ్యాఖ్యలు

తమిళ రాష్ట్ర గీతానికి ప్రథమ స్థానం ఇవ్వాల్సిందేనని అల్టిమేటం

విజయ్ ప్రమాణ స్వీకారంలో ప్రోటోకాల్ తప్పిదాలపై నిలదీత



02

## టీఆర్ఎస్ అధినేత
# కవితకు కోర్టు సమన్లు

కామారెడ్డి రైల్ రోకో కేసులో కవితకు కోర్టు సమన్లు

రేపు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌తో నిర్వహించిన ఆందోళన

రైళ్ల రాకపోకలకు అంతరాయం.. 12 మందిపై కేసులు నమోదు



హైదరాబాద్, (డిడి9 వార్త): టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు రైల్వే కోర్టు నుండి సమన్లు జారీ అయ్యాయి. గతంలో కామారెడ్డిలో నిర్వహించిన రైల్ రోకోకు సంబంధించి నమోదైన కేసు విచారణలో భాగంగా, రేపు ఉదయం 10:30 గంటలకు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు ..మిగతా 2లో

# జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభం

మొదటి విడత ఇండ్ల నిర్మాణం పురోగతిలో ఉండగా సెకండ్ ఫేజ్‌కు ప్రభుత్వం సిద్ధం

రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష

సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఇందిరమ్మ ఇండ్ల పథకం విస్తరణ

హౌసింగ్, రెవెన్యూ అధికారులతో మంత్రి పొంగులేటి కీలక సమావేశం

ఇండ్ల నిర్మాణ వేగవంతానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని మంత్రి వెల్లడి



హైదరాబాద్, (డిడి9 వార్త): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం ఎ. రేవంత్ రెడ్డి సూచన మేరకు జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో సెకండ్ ఫేజ్ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి ..మిగతా 2లో

# నిప్పుల కొలిమిలా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటేశాయి. దీనికి తోడు విపరీతమైన ఉక్కపోత తోడవ్వడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. వాతావరణ కేంద్రం అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల చివరి వరకు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం దొరుకుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్న సామాన్యులకు వాతావరణ శాఖ తాజా ప్రకటన షాక్ ఇచ్చినట్లయింది. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

గత కొద్ది రోజులుగా అక్కడక్కడ కురిసిన తేలికపాటి జల్లులు ప్రజలకు కొంత ఉపశమనాన్ని ఇచ్చాయి. సముద్రం నుంచి వచ్చిన తేమ గాలులు, ఆకాశంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల వరకు తగ్గి వాతావరణం కాస్త చల్లబడింది. అయితే, ఇప్పుడు ఆ వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ద్రోణి ప్రభావం బలహీనపడటంతో మళ్లీ పొడి గాలులు మొదలయ్యాయని, సోమవారం నుంచే ఉష్ణోగ్రతలు యధావిధిగా పెరగడం ప్రారంభమైందని అధికారులు స్పష్టం చేశారు. గాలి మళ్ళిన దిశ (విండ్ డైరెక్షన్) మారడం వల్ల వేడి తీవ్రత పెరిగిందని, దీనివల్ల ఉష్ణోగ్రతలు మళ్లీ 40 డిగ్రీల పైకి చేరుకుంటున్నాయని తెలిపారు. ఏ ప్రాంతంలోనైనా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిన వెంటనే అక్కడ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేస్తామని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొందని, రాబోయే రోజుల్లో వేడిగాలుల ప్రభావం కూడా ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది.

మరోవైపు, ఈ మారుతున్న వాతావరణం అన్నదాతలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు అకస్మాత్తుగా వచ్చే అకాల వర్షాలతో రైతులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న కోతలు పూర్తయి, ఆ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఎండ తీవ్రత వల్ల ధాన్యం త్వరగా ఆరుతుందని సంతోషపడేలోపే, ఆకస్మికంగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టడం రైతులకు పెద్ద సవాలుగా మారింది. అకాల వర్షాల వల్ల ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని, తద్వారా మద్దతు ధర రాదేమోనని రైతాంగం ఆందోళన చెందుతోంది. అటు పగటిపూట నిప్పులు చెరిగే ఎండ, ఇటు సాయంత్రం వేళ అకాల వర్షాలతో వాతావరణంలో అనిశ్చితి నెలకొంది.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో కాంక్రీట్ భవనాల వల్ల వేడి తీవ్రత రెట్టింపుగా అనిపిస్తోంది. మే నెల చివరి వరకు ఇదే రకమైన వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ స్పష్టం చేయడంతో, అప్పటి వరకు ప్రజలు ఈ నిప్పుల కొలిమిని తట్టుకోక తప్పదు. వాతావరణంలో వచ్చే మార్పులను గమనిస్తూ ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలని ప్రభుత్వం కోరుతోంది. రాబోయే ఐదు రోజులు మాత్రం రాష్ట్రానికి అత్యంత క్లిష్టమైన రోజులుగా మారనున్నాయి.

# ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన పంటను సకాలంలో తూకం వేయక పోవడం, గన్ని బ్యాగులు మరియు హమాలీల కొరతపై వస్తున్న ఫిర్యాదులపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు ఏసీ గదులకే పరిమితం కాకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలను సందర్శించి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో విఫలమైతే కలెక్టర్లపై కూడా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేయడం గమనార్హం.

ధాన్యం తరలింపులో రవాణా సౌకర్యాల కొరత లేకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి రవాణా శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. నిబంధనల ప్రకారం లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. గోడౌన్లలో స్థలం లేదని సాకులు చెప్పవద్దని, అవసరమైతే రైతు బజార్లు, కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్ హాళ్లను తాత్కాలిక గిడ్డంగులుగా మార్చుకోవాలని వెసులుబాటు కల్పించారు. ధాన్యం లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు స్థానిక హమాలీలను వినియోగించుకోవాలని, లోడింగ్ పూర్తి కాగానే రైతులకు వెంటనే రశీదులు అందజేయాలని ఆదేశించారు. దీనివల్ల తాలు, తరుగు పేరుతో కొందరు వ్యాపారులు చేసే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. రైతులు తమ కష్టార్జితాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వమే పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారాల దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు సరిపడా టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ ఇచ్చే హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. రైతులు అప్రమత్తంగా ఉంటే పంట నష్టాన్ని నివారించవచ్చని చెప్పారు. మొక్కజొన్న పంట ఎక్కువగా పండే జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి, పక్కా ప్రణాళికతో సేకరణ జరపాలని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం మరియు పోలీసులు సమన్వయంతో పనిచేసి ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సీఎస్‌కు నివేదించాలని సూచించారు.

మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు తుమ్మల నాగేశ్వరరావు కూడా ఈ సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని, ఈ ప్రయోజనం మన రాష్ట్ర రైతులకు మాత్రమే దక్కాలని వారు స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం సరిహద్దులు దాటి తెలంగాణ కేంద్రాలకు రాకుండా చెక్ పోస్టుల వద్ద కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని కలెక్టర్లకు తెలిపారు. స్థానిక రైతుల ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా ఈ నెలాఖరు నాటికి ధాన్యం సేకరణ ప్రక్రియను సంపూర్ణంగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం అన్ని రకాల ఆర్థిక సహాయం అందిస్తుందని, అధికారులు జవాబుదారీతనంతో పనిచేసి రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడాలని మంత్రులు ఆకాంక్షించారు. మొత్తానికి ధాన్యం సేకరణలో జాప్యాన్ని నివారిస్తూ, అన్నదాతకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడటమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

# నీట్ 2026 పరీక్ష రద్దు

**మొదటిపేజీ తరువాయి**




నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారికంగా ప్రకటించింది. పరీక్ష నిర్వహణలో పారదర్శకతను కాపాడటానికి, ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడటానికే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడంతో, త్వరలోనే కొత్త తేదీలను ప్రకటించి మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్టీఏ తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించేందుకు కేంద్రం ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించింది.

రాజస్థాన్‌లోని కోటా కేంద్రంగా ఈ ప్రశ్నాపత్రం లీకేజీ డొంక కదిలింది. అక్కడ కొన్ని కోచింగ్ సెంటర్లు విద్యార్థులకు అందించిన మెటీరియల్, అసలు పరీక్షా పత్రంలోని ప్రశ్నలతో హూబహూ పోలి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దాదాపు 600 మార్కుల విలువైన ప్రశ్నలు పరీక్షకు ముందే బయటకు వచ్చినట్లు దర్యాప్తులో తేలింది. కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన 120కి పైగా ప్రశ్నలు పరీక్షకు 42 గంటల ముందే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైనట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్ వెల్లడించారు. ఈ ప్రశ్నాపత్రాన్ని ఒక్కో విద్యార్థికి రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. సికార్ మరియు కోటా ప్రాంతాల్లోని కోచింగ్ సంస్థల ప్రమేయంపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ నివేదికలు కేంద్ర విద్యాశాఖకు చేరడంతో, పరీక్ష నిర్వహణలో లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూ రద్దు నిర్ణయం తీసుకున్నారు.

ఈ పరీక్ష రద్దు వల్ల దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే, విద్యార్థులకు ఊరటనిచ్చేలా ఎన్టీఏ కొన్ని కీలక వెసులుబాట్లు ప్రకటించింది. ఇప్పటికే చెల్లించిన పరీక్ష ఫీజును విద్యార్థులకు తిరిగి రీఫండ్ చేస్తామని, మళ్లీ నిర్వహించే పరీక్ష కోసం ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయబోమని స్పష్టం చేసింది. ఎన్టీఏ తన సొంత వనరులతోనే రీఎగ్జామ్‌ను నిర్వహిస్తుందని, కొత్త అడ్మిట్ కార్డుల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపింది. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి విద్యార్థులు ఆందోళన చెందవద్దని, వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఎన్టీఏ భరోసా ఇచ్చింది. సీబీఐ విచారణలో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని ప్రభుత్వం హెచ్చరించింది.

నీట్ యూజీ2026 పరీక్షను మే 3వ తేదీన పెన్‌అండ్‌పేపర్ విధానంలో దేశవ్యాప్తంగా 551 నగరాలతో పాటు విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం మొత్తం 5,400కు పైగా కేంద్రాల్లో భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ, లీకేజీ కారణంగా ఆ శ్రమంతా వృథా అయింది. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఉన్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డు పెట్టుకుని పేపర్ బయటకు రావడం అధికారులను విస్మయానికి గురి చేసింది. ఏదేమైనా, మరోసారి పకడ్బందీగా పరీక్ష నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే తమ తక్షణ కర్తవ్యమని విద్యాశాఖ పేర్కొంది. విద్యార్థులు తమ ప్రిపరేషన్ కొనసాగించాలని, త్వరలోనే రీఎగ్జామ్ షెడ్యూల్ విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు.

# హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

**మొదటిపేజీ తరువాయి**

ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టంలోని సెక్షన్ 11, 12తో పాటు బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

ఈ కేసు విచారణలో జాప్యం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు ఉన్నతాధికారులను కఠినంగా ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌తో సమావేశమైన సీఎం, ఈ నెల 8వ తేదీనే ఫిర్యాదు అందినప్పటికీ చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యమైందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల వల్ల కొంత జాప్యం జరిగిందని డీజీపీ వివరణ ఇవ్వగా, వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం నియమించింది. సోమవారం నాడు డీసీపీ రితిరాజ్ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేసు డైరీని పరిశీలించారు. నిందితుడు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆమె మీడియాకు వెల్లడించారు. భగీరథ్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మరోవైపు ఈ కేసు కొత్త మలుపులు తిరుగుతోంది. తనపై వచ్చిన ఆరోపణలను బండి భగీరథ్ తీవ్రంగా ఖండిస్తున్నారు. సదరు బాలిక కుటుంబం కేవలం డబ్బుల కోసమే తనను బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ మేరకు భగీరథ్ తరపున కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, అక్కడ బాలిక తల్లిదండ్రులపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలా రెండు చోట్ల కేసులు నమోదు కావడంతో ఈ వ్యవహారం మరింత ముదిరింది. ఒకవైపు బాలిక కుటుంబం తమ కుమార్తెకు అన్యాయం జరిగిందని వాపోతుంటే, మరోవైపు ఇదంతా రాజకీయ కుట్రలో భాగమని బండి సంజయ్ అనుచరులు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా, హైకోర్టులో జరగబోయే విచారణ మరియు పోలీసుల తదుపరి చర్యలపై అందరి దృష్టి నెలకొంది. చట్టపరమైన చిక్కుల నుంచి భగీరథ్ బయటపడతారా లేక పోలీసులు అరెస్టు చేస్తారా అనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

# సనాతన ధర్మంపై ఉదయనిధి
# వివాదాస్పద వ్యాఖ్యలు

- **తమిళనాడు అసెంబ్లీ వేదికగా మళ్లీ రాజకీయ రచ్చ**
- **సనాతన ధర్మంపై పాత వ్యాఖ్యల పునరుద్ఘాటన**
- **ప్రతిపక్ష నేతగా తొలి ప్రసంగంలోనే ఘాటు వ్యాఖ్యలు**
- **తమిళ రాష్ట్ర గీతానికి ప్రథమ స్థానం ఇవ్వాల్సిందేనని అల్టిమేటం**
- **విజయ్ ప్రమాణ స్వీకారంలో ప్రోటోకాల్ తప్పిదాలపై నిలదీత**

**నేషనల్‌బ్యూరో (డిడి9 వార్త):**

తమిళనాడు రాజకీయాలు మరోసారి 'సనాతన ధర్మం' చుట్టూ తిరుగుతున్నాయి. డీఎంకే యువనేత, మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెను దుమారాన్ని రేపుతున్నాయి. ప్రతిపక్ష నేతగా తన తొలి ప్రసంగాన్ని వినిపిస్తూ, సనాతన ధర్మం ప్రజలను విభజిస్తోందని, దానిని కచ్చితంగా నిర్మూలించాలంటూ 2023 సెప్టెంబర్‌లో తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు ఆయన మళ్ళీ కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆనాడు ఈ వ్యాఖ్యల వల్ల కోర్టు కేసులు, తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, ఉదయనిధి ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తన పాత వైఖరినే పునరుద్ఘాటించడం గమనార్హం. ద్రవిడ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని చాటుతూనే, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో తాము రాజీపడబోమని ఆయన తేల్చి చెప్పారు. అసెంబ్లీలో ప్రతిపక్షం ఒక నిర్మాణాత్మక శక్తిగా పనిచేయాలని, గతంలో కంటే ఇప్పుడు ప్రతిపక్షానికి బలమైన సంఖ్యా బలం ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్రధానంగా ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జరిగిన ప్రోటోకాల్ తప్పిదాలను ఉదయనిధి ఎండగట్టారు. తమిళ రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాల్తు'ను కాదని, ముందుగా వందేమాతరం, జనగణమన పాడటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమిళనాడులో జరిగే ఏ ప్రభుత్వ కార్యక్రమంలోనైనా రాష్ట్ర గీతానికే ప్రథమ స్థానం ఉండాలని, మన హక్కులను, సంప్రదాయాలను కాపాడుకోవడంలో రాజీ పడకూడదని హితవు పలికారు. గతంలో గవర్నర్ ఆర్.ఎన్. రవి గీతాల ఆలాపనలో మార్పులు చేయడానికి ప్రయత్నిస్తే డీఎంకే ఏ విధంగా అడ్డుకుందో గుర్తు చేస్తూ, ప్రస్తుత విజయ్ ప్రభుత్వం ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగనివ్వకూడదని హెచ్చరించారు. రాష్ట్ర గీతాన్ని పక్కన పెట్టే ఏ ప్రయత్నాన్ని డీఎంకే అనుమతించదని, ప్రజల సెంటిమెంట్లతో ఆడుకోవద్దని సూచించారు.

తన ప్రసంగంలో భాగంగా ఉదయనిధి స్టాలిన్ కాస్త చమత్కారాన్ని కూడా జోడించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్, స్పీకర్ జేసీడీ ప్రభాకర్ మరియు తాను ఒకే లొయోలా కాలేజీలో చదువుకున్నామని, అందరం పూర్వ విద్యార్థులమేనని చెప్పారు. అయితే, చదువులో క్లాస్‌మేట్స్ అయినప్పటికీ, రాజకీయాల్లో మాత్రం డీఎంకే పార్టీనే సీనియర్ బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. ద్రవిడ దిగ్గజం సీఎన్ అన్నాదురై మాటలను ఉటంకిస్తూ.. ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల దిశగా సాగాలంటే ప్రతిపక్షం అనేది ఒక వాహనానికి ఉన్న బ్రేకులు లేదా ఎద్దుకు కళ్లెం లాంటిదని అభివర్ణించారు. అధికార పక్షం 'అందరికీ అన్నీ' అనే సూత్రాన్ని పాటిస్తుందో లేదో తాము నిరంతరం నిఘా ఉంచుతామని, స్పీకర్ తటస్థంగా ఉండి ప్రతిపక్షానికి తగిన అవకాశం ఇవ్వాలని కోరారు. సభలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య పెరగడం పట్ల కూడా ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మరోవైపు ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఆయన మళ్లీ సనాతన ధర్మంపై ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. గతంలో సుప్రీంకోర్టు కూడా ఇలాంటి వ్యాఖ్యలను ద్వేషపూరిత ప్రసంగాలుగా పరిగణించిందని, అయినా ఉదయనిధిలో మార్పు రాలేదని విమర్శించారు. తమిళనాడులో డీఎంకే పరాజయం పాలైనప్పటికీ, హిందూ వ్యతిరేక ధోరణిని వీడటం లేదని, కాంగ్రెస్ వంటి మిత్రపక్షాలు కూడా దీనిని ఖండించకపోవడం దారుణమని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆరోపించారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా, ప్రతిపక్ష కూటమి నేతలకు ఇంకా జ్ఞానోదయం కాలేదని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు జాతీయ స్థాయిలో మరోసారి రాజకీయ వేడిని పెంచాయి.

# టీఆర్ఎస్ అధినేత కవితకు కోర్టు సమన్లు

**మొదటిపేజీ తరువాయి**

హాజరు కావాలని న్యాయస్థానం ఆమెను ఆదేశించింది.

బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో కవిత ఆధ్వర్యంలో గతంలో కామారెడ్డిలో భారీ ఎత్తున రైల్ రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ బిల్లులకు కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో భాగంగా దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఒక గూడ్స్ రైలును నిలిపివేయడంతో నిజామాబాద్-హైదరాబాద్ రూట్‌లో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రైల్వే ట్రాక్‌పై నిరసనలు తెలపడం, రైళ్లను నిలిపివేసి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినందుకు గానూ కవితతో పాటు మరో 12 మంది నాయకులపై రైల్వే చట్టం (Railway Act) 147, 74(a) సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ ఇప్పుడు తుది దశకు చేరుకోవడంతో కోర్టు సమన్లు జారీ చేసింది.

# జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్‌ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

**ప్రతిపాదనలు సిద్ధం చేయండి:**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బిహెచ్ కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్**

2 బిహెచ్‌కె ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్ధిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్ధిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పీడీలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెన్‌ఎన్ యుఆర్‌ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశించారు.

**అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదు:**

అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి గారు హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్‌సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని, స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## ముగ్గురికి డ్రంక్ అండ్ డ్రైవ్ లో 3 రోజుల జైలు శిక్ష

- **20 మందికి ఒక్కొక్కరికి రూ 1000 జరిమానా**
- **శిక్ష విధించిన జేఎఫ్సిఎం న్యాయమూర్తి కే సందీప్ కుమార్**
- **బోథ్ సీఐ డి గురుస్వామి**

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 12(డి డి 9వార్త ):-**

డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ప్రాణ నష్టం సంభవిస్తుందని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని బోథ్ సీఐ డి గురు స్వామి తెలిపారు. ఈరోజు బోథ్ జె ఎఫ్ సి ఎం న్యాయమూర్తి కే సందీప్ కుమార్ ముగ్గురూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. వీరందరూ బజార్హత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదైన వారుగా తెలిపారు.

1) మేస్త్రం జ్ఞానేశ్వర్ S/o హనుమాన్లు R/o పార్డీ (k)
2) రాథోడ్ సంతోష్ S/o భీమ్ రావు R/o దన్నూరు
3)వగత్కార్ శ్రావణ్ S/o రామ రావు R/o అందుగూడ

ప్రమాదాలకు కారణమవుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 20 మందికి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయని, ప్రజలు గమనించాలని తెలిపారు.




## భూ నష్ట పరిహారం కింద రూ. 19,78,116/ అందజేసిన గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మే 12(డి డి 9వార్త ):-**

నెరడిగొండ మండలంలోని రాజురా భూ నిర్వాసితులకు నష్టపరిహారం కింద ఈరోజు గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ . 9 మంది బాదితులకు గాను రూ. 19 లక్షల 78 వేల 116 లను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన హోంజ బాయి చౌహన్ గారికి రూ. 1,99,972/ మరియు శ్రీ కనిరామ్ గారికి రూ. 1,61,268/ మరియు జాదవ్ ప్రేమ్సింగ్ గారికి రూ. 1,09,662/ మరియు రాథోడ్ జైత్రం గారికి రూ. 2,58,029/ మరియు రాథోడ్ దూద్రాం గారికి రూ. 2,97,705/ మరియు రాథోడ్ కలబాయి గారికి రూ. 1,83,845/ మరియు జాదవ్ లక్ష్మీ బాయి గారికి రూ. 2,70,930/ మరియు జాదవ్ నారాయణ గారికి రూ. 2,29,000/ మరియు రాథోడ్ దూద్రాం గారికి రూ. 2,67,705/ లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సజన్, ప్రతాప్ తదితరులు ఉన్నారు




## అజిత్ సీడ్స్ ఆధ్వర్యంలో రైతులకు తువ్వాలు పంపిణీ

- **నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులే లక్ష్యం**

**డిడి9 వార్త గుడిహత్నూర్ :**

మండలం లోని తోషం గ్రామంలో మంగళవారం వ్యవసాయ రంగ అభివృద్ధికి నాణ్యమైన విత్తనాలే పునాది అని రైతులకు అవగాహన కల్పిస్తూ అజిత్ సీడ్స్ ఆధ్వర్యంలో రైతులకు వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రత ఉండడంతో తువ్వాళాలు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అజిత్ సిడ్స్ సంస్థ అర్ యమ్ వి. వేణు, డియం అప్కం పోచ్చన్న మాట్లాడుతూ, రైతులు నకిలీ విత్తనాలకు మోసపోకుండా ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలనే వినియోగించాలని సూచించారు. పత్తి రకం ఎసిచ్ 1199,ఎసిచ్ 900,ఎసిచ్ 155 కొత్త రకం ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులకు పంటల సాగు విధానం, ఎరువుల వినియోగం, పురుగుమందుల పిచికారీపై పలు సూచనలు చేశారు. రైతుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అజిత్ సీడ్స్ ఎల్లప్పుడూ ముందుంటుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతుల ఆర్థికాభివృద్ధికి సంస్థలు సహకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అలీమ్ ఖాన్ శభాష్ ఖాన్ ఉల్వకాని వెంకట్ రాచర్ల తిరుపతి ఎల్క పెల్లి సదానంద్ భీంరావు రైతులు పాల్గొన్నారు




# నీట్ రద్దు.. విద్యార్థులకు శాపంగా ఎన్డీఏ వైఫల్యం

- **"23 లక్షల మందికి మానసిక క్షోభ"..**
- **విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆగ్రహం**
- **పరీక్ష రద్దు కేంద్రం వైఫల్యమన్న కేటీఆర్**
- **2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందన్న కేటీఆర్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

వైద్య విద్య జాతీయ అర్హత పరీక్ష (నీట్‌యూజీ) 2026 పరీక్ష రద్దుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా పరీక్ష రద్దు పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఇది కేంద్రానికి సిగ్గుచేటు అన్నారు.
ఎన్డీయే వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందని అన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ అయ్యాయని ఆరోపించారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందని గుర్తు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం వైఫల్యం వల్లే మరోసారి అలాంటి పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు.
నీట్ పేపర్ లీకేజీ, పరీక్ష రద్దుపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీతో ప్రతి దశలో మోసాలు కనబడుతున్నాయని విమర్శించారు. నీట్ పరీక్ష వ్యవస్థే పెద్ద కుంభకోణమని, ప్రతి సంవత్సరం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ప్లస్ టూ పరీక్షల్లో స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానం తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.





## హర్కాయిలో తీవ్ర తాగునీటి సంక్షోభం

- **రెండు రోజులుగా నిలిచిపోయిన మిషన్ భగీరథ సరఫరా**
- **బావులు ఎండిపోవడంతో ప్రజల అవస్థలు**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : డిడి 9 వార్త న్యూస్**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పరిధిలోని మారుమూల గ్రామమైన హర్కాయి గ్రామం లో తీవ్ర తాగునీటి సంక్షోభం నెలకొంది. గత రెండు రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండుతున్న ఎండలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో గ్రామంలో నీటి కొరత మరింత తీవ్రమవుతోంది. గ్రామ ప్రజలు ప్రధానంగా మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడుతుండగా, సరఫరా ఆగిపోవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గ్రామంలో ఉన్న ఒకే ఒక్క బావిలో కూడా నీటి మట్టం రోజురోజుకూ తగ్గిపోతోంది. ఎండల తీవ్రత కారణంగా భూగర్భ జలాలు క్షీణించడంతో కొన్ని ప్రాంతాల్లో బావులు పూర్తిగా ఎండిపోయిన పరిస్థితి ఏర్పడింది.తాగునీటి కోసం గ్రామస్తులు ఉదయం నుంచే బిందెలతో బావుల వద్ద బారులు తీరుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది గ్రామస్తులు దూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. తాగునీటి కొరతతో పాటు పశువులకు కూడా నీరు అందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
గ్రామ ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆరోపిస్తున్నారు. వేసవి ప్రారంభంలోనే ఈ పరిస్థితి ఉంటే రాబోయే రోజుల్లో సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హర్కాయి గ్రామానికి తక్షణమే ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని, మిషన్ భగీరథ పైపులైన్‌లో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అదనపు బోర్లు త్రవ్వించి శాశ్వత నీటి వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను ముందుగానే గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం హర్కాయి గ్రామంలో నెలకొన్న పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న నీటి సంక్షోభానికి అద్దం పడుతోంది.



## ఇద్దరికీ డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒక రోజు జైలు శిక్ష

- **ఐదుగురికి జరిమానా**
- **శిక్ష విధించిన బోథ్ జేఎఫ్సిఎం న్యాయమూర్తి కె సందీప్ కుమార్**
- **ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ కె నరేష్ కుమార్**

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : డిడి 9 వార్త న్యూస్**




డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల ప్రాణ నష్టం సంభవిస్తుందని డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని ఇచ్చోడ ఎస్ హెచ్ ఓ కె నరేష్ కుమార్ తెలిపారు ఈరోజు బోథ్ జె ఎఫ్ సి ఎం న్యాయమూర్తి కె సందీప్ కుమార్ ఇద్దరు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారికి ఒకరోజు జైలు శిక్ష విధిస్తూ, ఐదుగురికి జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారు.
నవహరే బాబారావు తండ్రి కిషన్, వయస్సు: 33 సంవత్సరాలు, నివాసం: మన్నూర్ గ్రామం, గుడిహత్నూర్ మండలం. సిడాం సుభాష్ తండ్రి భీంరావు, వయస్సు: 32 సంవత్సరాలు, నివాసం: కుంటాల గ్రామం, నేరడిగొండ మండలం. ప్రమాదాలకు కారణమవుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారి పట్ల కఠినంగా వ్యవహరించనున్నట్లు తెలిపారు.

## పోతంగల్ పాఠశాల యందు వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు

**నిజామాబాద్ పోతంగల్ మే 12(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని సోమవారం రోజున మండల విద్యాధికారి మరియు పొతంగల్ గ్రామ సర్పంచ్ శ్రీమతి సంధ్యా గారి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీ ఎల్ శంకర్ సార్ గారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ఈ శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఈ శిబిరంలో మ్యూజిక్, డాన్స్, కుట్లు అల్లికలు మరియు యోగా ఇతర క్రీడలు నేర్పించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న ఆరు నుండి తొమ్మిదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని తెలపడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ సాయిలు సార్ గారు, ఏ ఏ పీ సి చైర్మన్ శ్రీమతి అనురాధ గారు మరియు మాజీ ఎంపీపీ శ్రీ పవన్ కుమార్ గారు, మాజీ సర్పంచ్ గంట్ల విట్టల్ గారు, రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్ సార్ గారు, గ్రామ పెద్దలు శంకర్ సార్, వార్డు సభ్యులు పంచ రెడ్డి అనిల్ గారు, ధనరాజు గారు, రాజుగారు, వివేకానంద యూత్ సభ్యులు మరియు ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది.



## అనారోగ్యంతో మరణించిన బిజెపి నాయకుడికి ఆర్థిక సహాయం అందజేసిన ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్

**నిజామాబాద్ పోతంగల్ మే 12(డిడి9 వార్త)**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యకర్త శెట్టి సాయిలు తండ్రి గారు పెద్ద సాయిలు అనారోగ్యం తో మరణించడం జరిగింది స్థానిక బీజేపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకులు NRI కోనేరు శశాంక్ తక్షణమే స్పందించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమం లో మండల సీనియర్ నాయకులు మార్కలి ప్రకాష్ పటేల్, మాజీ వైస్ ఎంపీపీ బాలగంగాధర్ టాక్రె, బూత్ అధ్యక్షులు గోపురు రమేష్,ప్రధాన కార్యదర్శి శెట్టి గంగారాం, కోటగిరి మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ మండలం అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, మరియు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



## నూతన కళ్యాణ మండపం ప్రారంభోత్సవం

**నిజామాబాద్ పోతంగల్ మే 12(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని సోమవారం రోజున నూతన ఎం ఎం ఆర్ కళ్యాణ మండపం ప్రారంభోత్సవనికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య సలహాదారులు స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, తెలంగాణ ప్రభుత్వం ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు గారు వీరి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి కళ్యాణ మండపం ప్రారంభించారు వారు మాట్లాడుతూ ప్రతి ఫంక్షన్ అన్ని సౌకర్యాలతో జరుపుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు అటువంటిది పోతంగల్ లో ఇంత పెద్ద ఫంక్షన్ హాల్ నిర్మాణం చేసి మంచి సౌకర్యాన్ని ప్రజలకు అందిస్తున్న మండవ దిలీప్ కుమార్, మల్లెపూల రాజా గౌడ్, వారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పి ఎ సి ఎస్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ,నాయకులు రంగారావు, మాజీ జెడ్పిటిసి పుష్పాల శంకర్ , మాజీ ఎంపీపీ గంధపు పవన్ , మాజీ మండల అధ్యక్షుడు ఇజాజ్ ఖాన్ ,పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# మైనర్ బాలికకు న్యాయం చేయాలి..!

- **సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్.**

**దుబ్బాక, మే 12,(డిడి9 వార్త):**



మైనర్ బాలికపై అత్యాచారం చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మైనర్ బాలికను అత్యాచారం చేసిన ఘటనలో బండి భగీరథ్ పై నమోదు అయిన ఫోక్సో కేసులో బలహీన మైన సెక్షన్లు నమోదు చేసి కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆమె ఆరోపించారు. ఈ ఘటనలో బాధిత మైనర్ బాలికకు పూర్తి న్యాయం చేయాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోక్సో చట్టంలోని సెక్షన్లు 7, 8 కింద కేసు నమోదు చేయాల్సిన చోట సెక్షన్లు 11, 12 కింద నమోదు చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బాధిత బాలిక కేసు నమోదు చేసి ఐదు రోజులు గడుస్తున్న ఇప్పటి వరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని కోరారు. మైనర్ బాలికకు న్యాయం చేయాలనీ,దోషులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కాంగ్రెస్ బీజేపీ రాజకీయ నాటకాలు ఆపాలని హెచ్చరించారు. చట్టం దృష్టిలో అందరు సమానమే సామాన్యుడికి డబ్బులు, పదవులు ఉన్న బడా బాబులకు కూడా ఓకే చట్టం వర్తిస్తుందని నిరూపించాలన్నారు. తెలంగాణలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.ప్రజల భద్రతను కాపాడాల్సిన ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసం మౌనం వహించడం దురదృష్టకరమని, మైనర్ బాలికపై జరిగిన ఈ ఘటనలో



# ఇంధనానికి ఎందుకు సెలవు ..?

- **ఆదివారం పెట్రోల్ బంకులు బంద్..?**
- **ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం**

**దుబ్బాక, మే12, ( డిడి9 వార్త )**

దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం పెట్రోల్ బంకులను బందు చేస్తున్నట్లు సమాచారం. పెట్రోల్ బంకులు, వైద్యం, రవాణా మందు చేయడం పట్ల ప్రజలకు అనేక ఇబ్బందులు కలుగుతాయి. విద్యుత్, రవాణా, పెట్రోల్, వైద్యం ఈ సౌకర్యాలు 24 గంటలు ఉండాలని ప్రజలు కోరుతున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం కొన్ని రాష్ట్రాలకు ఆదివారం పెట్రోల్ బంకులకు సెలవు ఇవ్వడం ఏమిటని పలువురు ప్రశ్నించుకుంటున్నారు. ఇంధనం ఎప్పుడు అవసరం ఉన్నప్పుడు వాడుకుంటారు. కానీ ఇంధనానికి సెలవు ఇవ్వడం ఏమిటని పరువురు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం బంకులు బంద్ తధాంతరం విద్యుత్ బంధు, మరో రోజు వైద్య బంధు ప్రభు

# పీర్లపల్లి లో వైభవంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన

- **భారీగా తరలివచ్చిన భక్తులు**
- **ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట**

**డిడి9 వార్త గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండలం పీర్లపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి ఎటువంటి కీడు జరగకుండా, పాడిపంటలతో వర్ధిల్లాలని గ్రామస్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పెద్దమ్మ తల్లి, పెద్దిరాజుల కళ్యాణం లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలందరూ అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దమనిషి శంకు బాలయ్య ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కొండ శ్రీను ఉపాధ్యక్షులు రొయ్యల శ్రీను ముదిరాజ్ సంఘం సభ్యులు శ్రీపతి మల్లేశం సత్యనారాయణ మల్లేశం కనకయ్య కొండల్ మురళి రొయ్యల నర్సిములు ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు,



# సొసైటీకి తాళం వేసి రైతుల నిరసన

- **తెలంగాణ, సొసైటీకి తాళం వేసి రై*సొసైటీకి తాళం వేసి రైతుల నిరసన**
- **తెలంగాణ, సొసైటీకి తాళం వేసి రైతుల నిరసన**

**నిజామాబాద్ పోతంగల్ మే 12 (డిడి9 వార్త):**




నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల విశాల సహకార సంఘం పరిధిలోని హెగ్డులి గ్రామంలో రైతులు సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు. పోతంగల్ విశాల సహకార సంఘం పరిధిలోని హెగ్డోలి గ్రామంలో రైతులు మంగళవారం సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు పుప్పాల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. తమకు అవసరం లేని నానో యూరియా లిక్విడ్ , అంటగట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తీసుకున్న లిక్విడ్ మిగిలిపోయి ఉందన్నారు. మూడు సంచుల ఎరువులు తీసుకుంటే ఒక లిక్విడ్ బాటిల్ తీసుకోవాలనే కండీషన్ పెట్టడంతో రైతులు , నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లిక్విడ్ తీసుకోవడం మూలంగా రైతులపై రూ.200 అదనపు భారం పడుతుందన్నారు. ఇప్పటికే మందుల రేట్లు పెరిగిపోయాయని పేర్కొన్నారు. 10 సంచులకు ఒకటి ఇస్తే తీసుకుంటామని తెలిపారు. స్పందించిన ఏవో రైతుల ఆరోపణలపై ఏవో నిశితను వివరణ కోరగా.. రైతులకు అనవసరంగా నానో యూరియా ఇవ్వొద్దని చెప్పామన్నారు. సొసైటీ వాళ్లను అడిగితే రైతులు లిక్విడ్ తీసుకోకుంటే స్టాక్ రిటర్న్ చేస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రుక్మయ్య, అర్జున్, సురేందర్, అశోక్, ప్రవీణ్, భారత్, చందు, గణేష్, రాము, ఆంజనేయులు, వినయ్, సురేందర్ పాల్గొన్నా

రు.తుల నిరసన

**సొసైటీకి తాళం వేసి రైతుల నిరసన**

పోతంగల్ విశాల సహకార సంఘం పరిధిలోని హెగ్డేలి గ్రామంలో రైతులు సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు. పోతంగల్ విశాల సహకార సంఘం పరిధిలోని హెగ్డోలి గ్రామంలో రైతులు మంగళవారం సొసైటీకి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు పుప్పాల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. తమకు అవసరం లేని నానో యూరియా లిక్విడ్ , అంటగట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తీసుకున్న లిక్విడ్ మిగిలిపోయి ఉందన్నారు. మూడు సంచుల ఎరువులు తీసుకుంటే ఒక లిక్విడ్ బాటిల్ తీసుకోవాలనే కండీషన్ పెట్టడంతో రైతులు , నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లిక్విడ్ తీసుకోవడం మూలంగా రైతులపై రూ.200 అదనపు భారం పడుతుందన్నారు. ఇప్పటికే మందుల రేట్లు పెరిగిపోయాయని పేర్కొన్నారు. 10 సంచులకు ఒకటి ఇస్తే తీసుకుంటామని తెలిపారు.

**స్పందించిన ఏవో**

రైతుల ఆరోపణలపై ఏవో నిశితను వివరణ కోరగా.. రైతులకు అనవసరంగా నానో యూరియా ఇవ్వొద్దని చెప్పామన్నారు. సొసైటీ వాళ్లను అడిగితే రైతులు లిక్విడ్ తీసుకోకుంటే స్టాక్ రిటర్న్ చేస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రుక్మయ్య, అర్జున్, సురేందర్, అశోక్, ప్రవీణ్, భారత్, చందు, గణేష్, రాము, ఆంజనేయులు, వినయ్, సురేందర్ పాల్గొన్నారు.



# హరిగోశ పడుతున్న రైతులు

- **హరిగోశ పడుతున్న రైతులు**
- **రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**
- **ధాన్యాన్ని వెంటనే తరలించాలి**
- **నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి**

**కౌడిపల్లి డిడి9 వార్త :-**





కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాలపాలు చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు మంగళవారం మండల కేంద్రమైన కౌడిపల్లి లోని జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి నెల గడుస్తున్న తూకం వేయడం లేదని రైతులను కష్టాలపాలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి రైతులను హరిగోశ పెడుతుందని రైతులకు రైతుబంధు వేయడం లేదని పెట్టుబడులేక రైతులు కష్టాలపాలవుతున్నారని అంతేకాకుండా కరెంటు కోతలు విధిస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ప్రభుత్వం పై ధ్వజమెత్తారు ధాన్యాన్ని వెంటనే తూకం వేసి ధాన్యాన్ని తరలించాలని ధాన్యం కేంద్రాల వద్ద సంచులు,హమాలీలు లేరని ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారా రామ గౌడ్, ఉత్తమ రైతు మహిపాల్ రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ దుర్గారెడ్డి, సర్పంచులు కుమార్, పట్లోళ్ల శ్రీనివాస్, కుమార్, బాకీ సుమలత, నాయకులు కాంతారావు, రాజు, పోలా నవీన్, బొడ్ల నవీన్ గుప్తా, కుమ్మరి సతీష్, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీమిండియా పునరాగమనంపై భువనేశ్వర్ కుమార్ ఏమన్నాడంటే..!

- **టీమిండియా పునరాగమనంపై స్పందించిన వెటరన్ పేసర్ భువనేశ్వర్**
- **గత అనుభవాల రీత్యా దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకోవడం మానేశానని వెల్లడి**
- **ఐపీఎల్ 2026లో ఆర్‌సీబీ తరఫున 21 వికెట్లతో అద్భుత ప్రదర్శన**
- **ఎక్స్‌ప్రెస్ బౌలర్‌ను కాకపోవడమే తన కెరీర్‌కు మేలు చేసిందని వ్యాఖ్య**
- **జాతీయ జట్టుకు దూరమవడంతో పనిభారం తగ్గిందని పేర్కొన్న భువీ**

**డిడి9 వార్త:**
సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ జాతీయ జట్టులోకి తన పునరాగమనంపై వస్తున్న చర్చలకు తెరదించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) తరఫున అద్భుతంగా రాణిస్తున్నప్పటికీ, తాను మళ్లీ భారత జట్టులోకి రావడం గురించి ఆలోచించడం లేదని స్పష్టం చేశాడు. గతంలో ఎదురైన నిరాశల కారణంగా దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం మానేశానని అన్నాడు.
ఈ సీజన్‌లో ఇప్పటివరకు 21 వికెట్లు పడగొట్టి ఆర్‌సీబీ విజయావకాశాల్లో కీలక పాత్ర పోషిస్తున్న 36 ఏళ్ల భువనేశ్వర్‌ను తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలని పలువురు మాజీ క్రికెటర్లు, క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్‌సీబీ విడుదల చేసిన ఓ వీడియోలో భువీ మాట్లాడుతూ.. "నేను టీమిండియా కమ్‌బ్యాక్ గురించి ఆలోచించడం లేదు. దీర్ఘకాలిక లక్ష్యాలు పెట్టుకోవడం ఎప్పుడో మానేశాను. ఎందుకంటే అలా చేసినప్పుడల్లా అది నాకు కలిసి రాలేదు" అని తెలిపాడు. తన సుదీర్ఘ కెరీర్‌ను గుర్తుచేసుకుంటూ.. "నాకు సహజంగానే బంతిని స్వింగ్ చేసే నైపుణ్యం ఉంది. అది దేవుడిచ్చిన వరం. నేను ఎప్పుడూ ఎక్స్‌ప్రెస్ బౌలర్‌ను కాదు. వేగంగా బౌలింగ్ చేయకపోవడం వల్ల త్వరగా అలసిపోను. బహుశా అదే నా కెరీర్‌కు మేలు చేసి ఉండవచ్చు" అని వివరించాడు.
టీ20 ఫార్మాట్‌లో తన బౌలింగ్ వ్యూహాల గురించి మాట్లాడుతూ.. "పవర్‌ప్లేలో బంతి స్వింగ్ అయితే వికెట్ల కోసం ప్రయత్నిస్తా. డెత్ ఓవర్లలో ఆత్మవిశ్వాసంతో బంతులు వేయడం ముఖ్యం. ఏ దశలోనైనా సింపుల్‌గా ఆలోచించడమే నా మంత్రం" అని చెప్పాడు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్ ఆడకపోవడం వల్ల ఐపీఎల్ తర్వాత తగినంత విశ్రాంతి దొరుకుతోందని, ఇది తన పనిభారాన్ని తగ్గించడంలో సహాయపడుతోందని భువనేశ్వర్ పేర్కొన్నాడు.



# నేను 4 ఓవర్లు బౌలింగ్ చేశా, ఇప్పటికీ నమ్మలేకపోతున్నా.. డీసీ ప్లేయర్ ఆనందం!

**డిడి9 వార్త:**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో యువ ఆటగాళ్లు సత్తాచాటుతున్నారు. అద్భుత బ్యాటింగ్, బౌలింగ్‌తో తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) తరఫున ఆడుతున్న యువ ఆల్‌రౌండర్ మాధవ్ తివారీ తాజాగా అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. సోమవారం పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచులో ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాట్, బాల్‌తో ఆకట్టుకున్న మాధవ్ తివారీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. మ్యాచ్ అనంతరం మాట్లాడిన అతడు.. ఈ అవకాశాన్ని ఇచ్చిన టీమ్ మేనేజ్‌మెంట్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. మాధవ్ బ్యాటింగ్‌లో (18 నాటౌట్; 8 బంతుల్లో 2×4, 1×6), బౌలింగ్‌లో (40/2) మెరిశాడు.



'ఈ అవకాశం ఇచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్ మేనేజ్‌మెంట్‌కు థ్యాంక్స్ చెప్పాలి. జట్టు విజయంలో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. ప్లేయర్‌గా అవకాశాలు రావడం మన చేతుల్లో ఉండదు. కానీ ప్రతి ప్రాక్టీస్ సెషన్‌లో మెరుగుపడటమే నా టార్గెట్. మునాఫ్ పటేల్ సర్‌తో కలిసి బౌలింగ్‌లో చాలా కష్టపడ్డాను. బ్యాటింగ్ కోచ్‌తో కలిసి పవర్ హిట్టింగ్‌పై పని చేశాను. ఇవాళ ఆ శ్రమ జట్టుకు ఉపయోగపడగలిగినందుకు ఆనందంగా ఉంది' అని మాధవ్ తివారీ తెలిపాడు. తాను బ్యాటర్‌నా? బౌలర్‌నా? అన్న ప్రశ్నకు మాధవ్ తివారీ ఆసక్తికర సమాధానం ఇచ్చాడు. 'నేను 100 శాతం బౌలర్, 100 శాతం బ్యాట్స్‌మన్' అంటూ ధైర్యంగా చెప్పాడు.
మ్యాచ్ పరిస్థితుల గురించి మాధవ్ తివారీ మాట్లాడుతూ.. 'ఈ వికెట్‌పై లెంగ్త్ బాల్స్‌కు సహకారం ఉంది. అందుకే మొదట్లో అదే ప్లాన్ ఫాలో అయ్యాను. మధ్యలో వైడ్ బాల్స్, షార్ట్ బాల్స్ కూడా మిక్స్ చేయడానికి ప్రయత్నించాను' అని వివరించాడు. తనకు నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసే అవకాశం రావడం కాస్త ఆశ్చర్యంగా అనిపించిందని తెలిపాడు. 'నేను ఎప్పుడూ సిద్ధంగానే ఉన్నాను. పరిస్థితులు పేసర్లకు అనుకూలంగా ఉన్నాయి. రెండో ఓవర్‌లో ఎక్కువ పరుగులు ఇస్తే నేనే వచ్చి బౌలింగ్ చేస్తానని కెప్టెన్ అక్షర్ పటేల్ సరదాగా చెప్పాడు. అదృష్టవశాత్తూ నేను బాగా బౌలింగ్ చేశాను. నేను 4 ఓవర్లు బౌలింగ్ చేశా. అందులోనూ బాగా బంతులు వేశాను. చాలా హ్యాపీగా ఉంది' అని చెప్పుకొచ్చాడు.
బ్యాటింగ్ విషయంలో కూడా కోచింగ్ స్టాఫ్ ఇచ్చిన సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని మాధవ్ వెల్లడించాడు. 'మా బ్యాటింగ్ కోచ్ ఇయాన్ బెల్ ఒకటే చెప్పాడు. నీలో పవర్ ఉంది, అనవసరంగా ఫ్యాన్సీ షాట్లు ఆడొద్దు. బంతికి సరిగ్గా రియాక్ట్ అవ్వమన్నాడు. అదే నేను ఫాలో అయ్యాను. నేను ముందునుంచీ ఇదే మైండ్‌సెట్‌తో ఆడుతున్నాను. ఇవాళ అది క్లిక్ అయింది అంతే. క్రికెట్‌లో మంచి, చెడు దశలు సహజం. కానీ ప్రాసెస్‌ను కొనసాగించడం ముఖ్యం. ఈరోజు అదృష్టం కూడా కలిసి వచ్చింది. ఆ క్యాచ్ డ్రాప్ అయింది.. పరుగులు కూడా వచ్చాయి' అని పేర్కొన్నాడు. మా బెంచ్ స్ట్రెంగ్త్ చాలా బలంగా ఉంది. యువ ఆటగాళ్లు కీలక సమయంలో బాధ్యత తీసుకోవడం జట్టుకు గొప్ప అనుకూలాంశం. బ్యాటింగ్, ఫీల్డింగ్, ఎనర్జీ.. ప్రతి విభాగంలో ఈ యువ ఆటగాళ్లు జట్టుకు ఉపయోగపడుతున్నారు. భవిష్యత్తులో ఢిల్లీ చాలా బలమైన జట్టుగా మారుతుంది' అని మాధవ్ ధీమా వ్యక్తం చేశాడు.

# ప్లేఆఫ్స్ రేసు మరింత ఆసక్తికరం.. ఆర్ఆర్ కంటే సీఎస్‌కేకు ఛాన్సెస్.. ఆ 3 జట్లకు మాత్రం!

**డిడి9 వార్త:**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ప్లేఆఫ్స్ రేసు చివరి దశకు చేరుకోవడంతో.. పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారింది. లీగ్ దశ ముగియడానికి రెండు వారాల కంటే తక్కువ సమయం మాత్రమే మిగిలి ఉన్నా.. ఇప్పటివరకు ఒక్క జట్టు కూడా అధికారికంగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేదు. ప్రస్తుతం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), గుజరాత్ టైటాన్స్ (జీటీ) జట్లు 11 మ్యాచ్‌లలో 14 పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాయి. పంజాబ్ కింగ్స్ 11 మ్యాచ్‌లలో 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. ఇక చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్లు 12 పాయింట్లతో వరుసగా ఐదో, ఆరో స్థానాల్లో నిలిచాయి.
ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ), కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్లకు కూడా ప్లేఆఫ్స్ అవకాశాలు పూర్తిగా ముగియలేదు. ఢిల్లీకి 12 మ్యాచ్‌ల్లో 10 పాయింట్లు ఉండగా.. కేకేఆర్ 10 మ్యాచ్‌ల్లో 9 పాయింట్లతో ఉంది. అయితే ముంబై ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ మాత్రం ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా తప్పుకున్నాయి. ప్రతి జట్టు లీగ్ దశలో మొత్తం 14 మ్యాచ్‌లు ఆడనుండటంతో చివరి వరకు సమీకరణాలు మారే అవకాశం ఉంది.
ఐపీఎల్ 10 జట్ల టోర్నీగా మారిన తర్వాత ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడానికి సాధారణంగా 16 పాయింట్లను 'మ్యాజిక్ నంబర్'గా భావిస్తున్నారు. 2022లో ఆర్సీబీ, 2023లో ముంబై, 2025లో మరోసారి ముంబై 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ప్లేఆఫ్స్ చేరాయి. అయితే 2024లో మాత్రం 14 పాయింట్లతో నాలుగు జట్లు సమానంగా నిలిచాయి. ఆ సమయంలో మెరుగైన నెట్ రన్‌రేట్ కారణంగా ఆర్సీబీ ప్లేఆఫ్స్ బెర్త్ దక్కించుకుంది. అధికారిక ప్లేఆఫ్స్‌కు పాయింట్స్ 18 అని తెలిసిన విషయమే.








ఐపీఎల్ అధికారిక బ్రాడ్‌కాస్టర్ల అంచనాల ప్రకారం.. ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్, ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు ప్లేఆఫ్స్ చేరే అవకాశాలు 80 శాతం ఉన్నాయి. పంజాబ్ కింగ్స్‌కు 62.5 శాతం అవకాశం ఉండగా.. చెన్నై సూపర్ కింగ్స్‌కు 42.7 శాతం, రాజస్థాన్ రాయల్స్‌కు 41.8 శాతం అవకాశాలు ఉన్నట్లు అంచనా. ఇక కేకేఆర్‌కు కేవలం 11.6 శాతం, ఢిల్లీ క్యాపిటల్స్‌కు 1.2 శాతం మాత్రమే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఆర్సీబీ, ఎస్ఆర్‌హెచ్, జీటీ టీమ్స్ ప్లేఆఫ్స్‌కు చేరడం దాదాపుగా ఖాయం. మిగిలిన ఒక్క స్థానం కోసం పంజాబ్, చెన్నై, రాజస్థాన్ పోటీ పడనున్నాయి. ఈ మూడింటిలో పంజాబ్ రేసులో ముందుంది. చూడాలి మరి ఏ టీమ్స్ ప్లేఆఫ్స్‌కు చేరుతాయో.

# కోహ్లీని అప్రతిష్ఠపాలు చేసేందుకు భారీ కుట్ర? .. జర్మన్ మోడల్ లిజ్‌లాజ్ సంచలన నిజాలు!

- **కోహ్లీ తన ఫొటోకు లైక్ కొట్టిన తర్వాత కొందరు జర్నలిస్టులు తనను సంప్రదించారన్న లిజ్‌లాజ్**
- **కోహ్లీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేశారని వెల్లడి**
- **భారీగా డబ్బు కూడా ఆఫర్ చేశారన్న లిజ్‌లాజ్**

**డిడి9 వార్త:**
కోహ్లీ తన ఇన్‌స్టా ఫొటోకు లైక్ కొట్టిన తర్వాత తనను కొందరు జర్నలిస్టులు సంప్రదించారని జర్మన్ మోడల్, సింగర్ లిజ్‌లాజ్ బాంబు పేల్చింది. కోహ్లీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేయాలని, అతను తనకు పర్సనల్ మెసేజ్‌లు చేస్తున్నట్లు అబద్ధాలు చెప్పాలని వారు కోరారని వెల్లడించింది. ఇందుకు గానూ ఆమెకు భారీగా డబ్బు కూడా ఆఫర్ చేశారట. అయితే విరాట్ పట్ల ఉన్న గౌరవం, తన విలువలకు కట్టుబడి ఆ ఆఫర్లను తాను తిరస్కరించానని ఆమె స్పష్టం చేసింది. డబ్బు కోసం ఒక వ్యక్తి జీవితాన్ని నాశనం చేయడం తన వల్ల కాదని ఆమె తన ఇంటర్వ్యూలో తెగేసి చెప్పింది.
లిజ్‌లాజ్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో విపరీతంగా షేర్ అవుతున్నాయి. విరాట్ కోహ్లీని టార్గెట్ చేసేందుకు కొంతమంది ఎంత నీచానికి ఒడిగడుతున్నారో ఈ ఘటన ద్వారా అర్థమవుతోందని కోహ్లీ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. ఒక అంతర్జాతీయ స్థాయి ఆటగాడిపై ఇలాంటి పెయిడ్ క్యాంపెయిన్స్ నిర్వహించడం సిగ్గుచేటని క్రికెట్ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.





జర్మనీకి చెందిన లిజ్‌లాజ్ (అసలు పేరు జెన్నిఫర్) కేవలం మోడల్ మాత్రమే కాదు, ఆమె ఎంతో ప్రతిభావంతురాలు. ఆమె సైకాలజీలో మాస్టర్స్ పూర్తి చేసింది. జర్మన్, డచ్, ఫ్రెంచ్ వంటి ఐదు భాషల్లో పట్టున్న ఆమెకు భారతీయ సంస్కృతి అన్నా, ఆహారం అన్నా చాలా ఇష్టం. ముఖ్యంగా విరాట్ కోహ్లీకి, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ఆమె పెద్ద అభిమాని. ఈ వివాదం తర్వాత కూడా ఆమె ఆర్సీబీ జెర్సీ ధరించి కోహ్లీకి మద్దతు తెలుపుతూ పోస్ట్‌లు చేయడం విశేషం.

# సొంతగడ్డపై బంగ్లాదేశ్ పులే... తొలి టెస్టులో పాకిస్థాన్ ఘోర పరాజయం

- **తొలి టెస్టులో పాకిస్థాన్‌పై 104 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ విజయం**
- **ఐదు వికెట్లతో చెలరేగిన బంగ్లా పేసర్ నహీద్ రాణా**
- **పాక్‌పై బంగ్లాదేశ్‌కు ఇది వరుసగా మూడో టెస్టు గెలుపు**
- **268 పరుగుల లక్ష్య ఛేదనలో 163 పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్**
- **అరంగేట్ర బ్యాటర్ అబ్దుల్లా ఫజల్ పోరాటం వృథా**

**డిడి9 వార్త:**
బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు సొంతగడ్డపై పులి అని నిరూపించుకుంది. మీర్‌పూర్ వేదికగా జరిగిన తొలి టెస్టులో 104 పరుగుల తేడాతో పాకిస్థాన్‌పై చారిత్రక విజయాన్ని నమోదు చేసింది. యువ పేసర్ నహీద్ రాణా అద్భుతమైన బౌలింగ్‌తో ఐదు వికెట్లు పడగొట్టి బంగ్లా గెలుపులో కీలక పాత్ర పోషించాడు. పాకిస్థాన్‌పై బంగ్లాదేశ్‌కు ఇది వరుసగా మూడో టెస్టు విజయం కాగా, స్వదేశంలో తొలి గెలుపు కావడం విశేషం. ఈ విజయంతో బంగ్లాదేశ్ సిరీస్‌లో 10 ఆధిక్యంలోకి వెళ్లింది.
268 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్, చివరి రోజు ఆట ముగిసే సమయానికి 163 పరుగులకే కుప్పకూలింది. ఐదో రోజు ఆట చివరి సెషన్‌లోకి ప్రవేశించేసరికి మ్యాచ్ ఉత్కంఠగా మారింది. పాకిస్థాన్ విజయానికి 152 పరుగులు అవసరం కాగా, చేతిలో ఏడు వికెట్లు ఉన్నాయి. ఈ దశలో అరంగేట్ర ఆటగాడు అబ్దుల్లా ఫజల్ (66) అద్భుతమైన పోరాట పటిమ కనబరిచాడు. సల్మాన్ అలీ అఘాతో కలిసి నాలుగో వికెట్‌కు 48 పరుగులు జోడించి పాక్ శిబిరంలో ఆశలు రేపాడు.
అయితే, టీ విరామం తర్వాత స్పిన్నర్ తైజుల్ ఇస్లాం ఈ జోడీని విడదీశాడు. ఫజల్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఫజల్ ఔటైన వెంటనే పాక్ బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలింది. మరో ఎండ్‌లో పేసర్ నహీద్ రాణా నిప్పులు చెరిగే బంతులతో విజృంభించాడు. సాద్ షకీల్, మహమ్మద్ రిజ్వాన్, నోమాన్ అలీ, షాహీన్ అఫ్రిది వికెట్లను వరుసగా పడగొట్టి పాక్ పతనాన్ని శాసించాడు. ముఖ్యంగా, రిజ్వాన్‌ను క్లీన్ బౌల్డ్ చేసిన తీరు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.




అంతకుముందు, బంగ్లాదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో (87) కీలక ఇన్నింగ్స్ ఆడటంతో 240/9 వద్ద డిక్లేర్ చేసి పాకిస్థాన్‌కు సవాలు విసిరే లక్ష్యాన్ని నిర్దేశించింది. పాక్ తరఫున అరంగేట్రంలోనే రెండు ఇన్నింగ్స్‌లలోనూ హాఫ్ సెంచరీలు చేసిన ఆరో బ్యాటర్‌గా అబ్దుల్లా ఫజల్ రికార్డు సృష్టించినా, జట్టును గెలిపించలేకపోయాడు.

**సంక్షిప్త స్కోర్లు:**
బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్: 413
రెండో ఇన్నింగ్స్: 240/9 డిక్లేర్డ్ (నజ్ముల్ హొస్సేన్ షాంటో 87, మొమినుల్ హక్ 56; హసన్ అలీ 352).
పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 386
రెండో ఇన్నింగ్స్: 163 (అబ్దుల్లా ఫజల్ 66; నహీద్ రానా 540).

# రజనీ... కమల్ సినిమాలో త్రిష?



తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

**ప్రేమ గట్టిగా...**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.

ప్రముఖ పాప్ సింగర్ బ్రిట్నీ స్పియర్స్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నేరాన్ని అంగీకరించారు. దక్షిణ కాలిఫోర్నియాలో మార్చిలో ఆమెపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరగ్గా.. ఆమె నేరాన్ని అంగీకరించారు. దీంతో ఆమెకు (Britney Spears) వెంచురా కౌంటీ సుపీరియర్ కోర్టు ఒకరోజు జైలు శిక్షతో పాటు కొన్ని నిబంధనలు విధించింది. శిక్షతో పాటు ఆమె భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం చేయకుండా ఉండటానికి కోర్టు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల పాటు ప్రభుత్వం నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించింది. ప్రతి వారం థెరపీ సెషన్లకు హాజరుకావాలని, నెలకు రెండుసార్లు తప్పనిసరిగా సైకియాట్రిస్ట్‌ను కలవాలని సూచించింది.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. ప్రముఖ సింగర్‌కు జైలు శిక్ష






## బట్టకాల్చి మీదేస్తే ఊరుకోం.. రీషూట్ పుకార్లపై మేకర్స్ స్ట్రాంగ్ కౌంటర్!

గత కొద్ది రోజులుగా నాని హీరోగా నటిస్తున్న 'ది పారడైజ్' సినిమా గురించి సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు వస్తూనే ఉన్నాయి. సినిమా అవుట్‌పుట్ అనుకున్న విధంగా రాలేదని, అందుకే చాలా వరకు ఇష్యూస్ చేస్తున్నారని వార్తలు వైరల్ అవుతున్నాయి. అయితే, తాజాగా ఇలాంటి వార్తల మీద సినిమా యూనిట్ అధికారికంగా స్పందించింది. ఇలాంటి తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారికి సీరియస్ వార్నింగ్ ఇస్తూ, అసలు వాస్తవాలను టీం బయటపెట్టింది.

"మా సినిమాను మొదటి రోజు ఎంత స్పష్టతతో ప్లాన్ చేశామో, ఇప్పుడు కూడా అంగుళం కూడా తేడా లేకుండా అదే పక్కా ప్రణాళికతో షూటింగ్ చేస్తున్నాం. ఇప్పటికే వంద రోజుల పాటు షూటింగ్ ఎంతో విజయవంతంగా పూర్తయింది. బ్యాలెన్స్ ఉన్న షెడ్యూల్ కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా, ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం జరుగుతోంది. ఇప్పటివరకు ఈ సినిమా కోసం ఏ ఒక్క సీన్ కూడా రీషూట్ చేయలేదు, భవిష్యత్తులో కూడా చేసే ప్రసక్తి లేదు. సోషల్ మీడియాలో వచ్చే ఎలాంటి నిరాధారమైన వార్తలను దయచేసి నమ్మకండి," అని మేకర్స్ పేర్కొన్నారు.

# తమిళనాడు కోడలిగా శ్రీలీల..?

చాలా తక్కువ సమయంలోనే టాలీవుడ్ అగ్ర హీరోలందరి సరసన నటించి స్టార్‌డమ్ తెచ్చుకున్న శ్రీలీల, ప్రస్తుతం కోలీవుడ్ బాలీవుడ్ చిత్రాలతో బిజీగా ఉన్నారు. తాజాగా చెన్నైలోని అమృత ఏవియేషన్ కాలేజ్ ఈవెంట్‌లో బ్రాండ్ అంబాసిడర్‌గా పాల్గొన్న ఆమె, విద్యార్థులతో ముచ్చటిస్తూ తన వ్యక్తిగత, సినీ జీవితం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

ఈ ఈవెంట్‌లో విద్యార్థులు శ్రీలీలను ఉద్దేశించి 'లేడీ సూపర్ స్టార్' అని నినాదాలు చేయగా, ఆమె సున్నితంగా ఆ ట్యాగ్‌ను తిరస్కరించారు.. 'నాకు ఇష్టమైన నటి నయనతార. ఆమె మాత్రమే అసలైన లేడీ సూపర్ స్టార్. ఆమె నాకు రోల్ మోడల్. ఆ స్థాయికి చేరుకోవడానికి నాకు ఇంకా చాలా సమయం పడుతుంది' అని తన వినయాన్ని చాటుకున్నారు. అలాగే, ఓటమికి భయపడకుండా ప్రయత్నిస్తూనే ఉండాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఇదే వేదికపై తన పెళ్లి గురించి శ్రీలీల చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.. 'చెన్నై కుర్రాళ్లు చాలా స్వీట్. ఇక్కడి దోశ అంటే నాకు చాలా



ఇష్టం. నయనతార గారి లాగే నేను కూడా చెన్నైలోనే పెళ్లి చేసుకుంటానా అనేది ఇప్పుడే చెప్పలేను' అని ఆమె నవ్వుతూ వ్యాఖ్యానించారు. ఈ మాటలతో శ్రీలీల తమిళనాడు కోడలిగా వెళ్లనున్నారా? లేదా అప్పుడే ఎవరితోనైనా ప్రేమలో పడ్డారా? అంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ధనుష్ సరసన నటిస్తున్న శ్రీలీల, బాలీవుడ్‌లో కార్తీక్ ఆర్యన్ మూవీతో పలకరించనున్నారు.

# అభిమానుల నిరీక్షణకు తెర.. 'పెద్ది' ట్రైలర్ విడుదలకు డేట్ ఫిక్స్ చేసిన మూవీ మేకర్స్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' (Peddi). ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 4న థియేటర్లలోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. అయితే రామ్ చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్ అప్‌డేట్‌ను మూవీ టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా ట్రైలర్‌ను మే 18న విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు.

అంతేకాకుండా ఒక ఆసక్తికరమైన పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రామ్ చరణ్ లుక్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ఆయన తన వెనుక ఒక మంచాన్ని తగిలించుకుని, ఒక చేతితో ట్రంక్ పెట్టెను, మరో చేతితో VIP అని రాసి ఉన్న కవర్‌ను పట్టుకుని రైల్వే ట్రాక్‌ను దాటుతూ కనిపిస్తున్నారు. ఈ రా అండ్ రస్టిక్ లుక్ సినిమాపై ఉన్న క్యూరియాసిటీని ఒక్కసారిగా పెంచేసింది. కాగా.. ఈ చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు జగపతి బాబు, దివ్యేందు శర్మ, సాయి కుమార్, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం.. ప్రమోషన్ల విషయంలోనూ తగ్గేదే లే అన్నట్లుగా దూసుకుపోతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న మెగా అభిమానులు సోషల్ మీడియాలో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పోస్టర్‌ను వైరల్ చేస్తున్నారు. మే 18న రాబోతున్న ట్రైలర్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# "హగ్గులు లేకపోతే నిద్ర పట్టదు"..

టాలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్‌పై గళమెత్తిన అతికొద్ది మంది నటీమణుల్లో గాయత్రీ గుప్తా ఒకరు. ఎప్పుడూ బోల్డ్ అండ్ స్ట్రైట్ ఫార్వర్డ్ వ్యాఖ్యలు చేసే ఆమె, తాజాగా ఒక ఇంటర్వ్యూలో "ఫిజికల్ టచ్" .. మానవ సంబంధాల ప్రాముఖ్యత గురించి సైంటిఫిక్ కోణంలో మాట్లాడారు.

మనిషి జీవితంలో శారీరక స్పర్శ (Physical Touch) కేవలం కామం కోసం మాత్రమే కాదని, అది మానసిక ప్రశాంతతకు, భద్రతా భావానికి సంకేతమని గాయత్రీ పేర్కొన్నారు. "ఒక మనిషి తాను సురక్షితంగా ఉన్నానని భావించాలంటే రోజుకు కనీసం 8 నుంచి 12 హగ్గులు అవసరం. అలా జరిగినప్పుడే రాత్రిపూట ప్రశాంతంగా నిద్ర పడుతుంది" అని ఆమె చెప్పారు. ఈ హగ్గులు కుటుంబ సభ్యులైన అమ్మ, నాన్న, సోదర సోదరీమణుల నుంచి పొందే ఆత్మీయ ఆలింగనం కావాలని ఆమె స్పష్టం చేశారు. అంతే కాదు కేవలం హగ్ చేసుకోవడమే కాకుండా, కనీసం 20 సెకన్ల పాటు ఆ టచ్ ఉండాలని గాయత్రీ సూచించారు.

అలా చేసినప్పుడు మన శరీరంలోని హార్మోన్లు సమతుల్యంగా ఉండి, మనసు రిలాక్స్ అవుతుందని, ఈ ప్రపంచంలో మనం సేఫ్‌గా ఉన్నామనే



ఫీలింగ్ కలుగుతుందని ఆమె వివరించారు. భద్రత ఆప్యాయతను ఇచ్చే ఏ స్పర్శ అయినా మనిషిని మానసికంగా దృఢంగా మారుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి. చాలా మంది నెటిజన్లు ఆమె చెప్పిన దానిలో వాస్తవం ఉందని, ఒత్తిడితో కూడిన నేటి జీవితంలో ఆత్మీయ అనురాగాలు చాలా అవసరమని కామెంట్స్ చేస్తున్నారు.



## జులై నుంచి సెట్ పైకి.. అనిల్ రావిపూడి మల్టీస్టారర్ చిత్రం షూటింగ్ అప్డేట్

వరుస బ్లాక్ బస్టర్ హిట్స్‌తో ఇండస్ట్రీలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా దూసుకుపోతున్నాడు అనిల్ రావిపూడి. దీంతో ఆయన నుంచి వచ్చే సినిమాల కోసం సినీ లవర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఇయర్ మెగాస్టార్ చిరంజీవి మన శంకర వర ప్రసాద్ గారు చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈయన ఇప్పుడు.. మల్టీస్టారర్ చిత్రాన్ని అనౌన్స్‌చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు విక్టరీ వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా ఒక క్లీన్, టిపికల్ అనిల్ ఎంటర్‌టైన్మెంట్‌ను సిద్ధం చేస్తున్నాడు. ఇప్పటికే దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా.. కీర్తీ సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ అప్డేట్ వచ్చింది. వచ్చే ఏడాది సంక్రాంతి టార్గెట్‌గా తెరకెక్కబోతున్న ఈ సినిమా షూటింగ్ జులై నుంచి మొదలు కానుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతుంది. ఇక ఈ సినిమా మ్యూజిక్ డైరెక్టర్ విషయంలో కూడా వార్తలు రాగా.. జీవీ ప్రకాష్ కుమార్ ఫైనల్ అయ్యారు. నవంబర్, లేదా డిసెంబర్ కల్లా టోటల్ షూట్ కంప్లీట్ చేసి 2027 సంక్రాంతికి విడుదల చేయనున్నారు' అని ఓ పోస్ట్ వైరల్‌గా మారింది.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 617, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 23-SP, SY NO 417, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 501510.